సాక్షి
కామారెడ్డి
శనివారం । 11 । మే । 2024



అభివృద్ధి చేస్తాం
ఎస్సీ కాలనీలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆయన రాత్రి మద్నూర్‌లోని ఎస్సీ కాలనీలో బస చేశారు.
- 2లో ▸



ఘనంగా బసవేశ్వర జయంతి
జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మా బసవేశ్వరుడి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు.
- 3లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /24.1

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'



కామారెడ్డి రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడంకోసం ఆదాయం వచ్చే కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, 22 మండల సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

18 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా మే నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈనెల 18 వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ విషయాన్ని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతియాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ సజావుగా సాగేలా చూడాలి

- ఎస్పీ సింధూశర్మ



కామారెడ్డి టౌన్ : ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సింధూశర్మ సూచించారు. ఈ నెల 13న పోలింగ్ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో పోలీస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకొని ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ జార్జ్, పట్టణ, రూరల్ సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, రామన్ సిబ్బంది పాల్గొన్నారు.



మూగబోనున్న మైకులు!

- నేటి సాయంత్రంతో ముగియనున్న ఎన్నికల ప్రచారం
- ఓటర్ల మద్దతు కోసం నేతల చివరి ప్రయత్నాలు
- పోలింగుకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం

పార్లమెంట్ ఎన్నికలు తుది అంకానికి చేరుకుంటున్నాయి. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. మరికొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. వీలైనంత ఎక్కువమంది ఓటర్లను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ బరిలో ఉన్నారు. అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. దాదాపు నెల రోజులుగా ఆయా రాజకీయ పార్టీల హోరాహోరీ ప్రచారం కొనసాగుతోంది. సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలతో హోరెత్తించారు. ఈ ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడనుంది. దీంతో మైకులు మూగనోము పట్టనున్నాయి. సోమవారం ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

మూడు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకం..
జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపు మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలలోనూ పైచేయి సాధించాలని యోచిస్తోంది. ఆ పార్టీ తరఫున ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అనుకూలిస్తాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలలో ఓటమితో డీలాపడ్డ బీఆర్‌ఎస్.. పార్లమెంట్ ఎన్నికలలో సత్తా చాటాలని యోచిస్తోంది. గెలుపుకోసం ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు ప్రచార పర్వంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలంమైందని, దీంతో ఓటర్లు తమ పార్టీనే ఆదరిస్తారని బీఆర్‌ఎస్ నేతలు నమ్ముతున్నారు.

బీజేపీ సైతం జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ఆశలు పెట్టుకుంది. మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు అయోధ్యలో రామ మందిర నిర్మాణం అంశాలు కలసి వస్తాయని, ఓటర్లు ఈసారి బీజేపీనే ఆదరిస్తారని ఆ పార్టీ నేతలు నమ్మకంతో ఉన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు..

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 6,80,921 మంది ఓటర్లున్నారు. ఇందులో 3,28,879 మంది పురుషులు, 3,52,012 మంది స్త్రీలు, 30 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. వీరికోసం 913 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాను 94 సెక్టార్లుగా విభజించారు. పోలింగ్ విధుల్లో 4,388 మంది పాల్గొంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ సమయంలో ప్రత్యేక పోలీసు బృందాలు పెట్రోలింగ్ నిర్వహించనున్నాయి.

ఓటరు నాడి ఎట్లుందో..

పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఓటరు నాడి ఎట్లుందోనని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన నేతలు.. సమావేశాలకు వస్తున్న జనాన్ని చూసి అంచనాలు వేసుకుంటున్నారు. అయితే అన్ని పార్టీల రోడ్‌షోలు, సభలు, సమావేశాలకు జనం వస్తుండడంతో ఓటరు నాడి ఎట్లుందో తెలియక నేతలు అయోమయంలో ఉన్నారు. ఓటరు నాడి పసిగట్టేందుకు వివిధ మార్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.

బాన్సువాడ: రాజాసింగ్ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు



కాంగ్రెస్ హయాంలో నిత్యం స్కాంలే

- వారికి అధికారం ఇస్తే ప్రజల ఆస్తులనూ లాక్కుంటారు
- రిజర్వేషన్లన్నీ ఒక్క వర్గానికే కట్టబెడతారు
- రోడ్‌షోలలో ఎమ్మెల్యే రాజాసింగ్

బాన్సువాడ/ఎల్లారెడ్డి: కాంగ్రెస్ హయాంలో నిత్యం స్కాంలు జరిగాయని, రూ. 12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. మోదీ పాలనలో ఒక్క స్కాం కూడా లేదన్నారు. శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఎల్లారెడ్డి, బాన్సువాడలలో రోడ్‌షోలలో పాల్గొన్నారు. బాన్సువాడలో తాడ్కోల్ రోడ్డు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు హిందువుల ఓట్లు అవసరంలేదని, ఆ పార్టీకి అధికారం అప్పగిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తీసేసి ఒక కమ్యూనిటీకే వర్తించేలా చట్టం తీసుకొస్తారని ఆరోపించారు. అంతే కాకుండా ప్రజల ఆస్తులనూ లాక్కునేందుకు ఆలోచన చేస్తున్నారన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని తొలగించి, బాబ్రీ మసీదు నిర్మిస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ఎంతోమంది ముస్లిం మహిళలకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి పదేళ్లలో మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల నిధులు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే తెలంగాణలో అభివృద్ధి జరిగిందన్నారు. జహీరాబాద్ ఎంపీగా బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. శనివారం సాయంత్రంతో ప్రచార ఘట్టం ముగుస్తుందని, సోషల్ మీడియా ఇన్‌చార్జీలు మరింత చురుకుగా పనిచేసి బీజేపీ అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేసి మోదీకి మద్దతు కూడగట్టాలని సూచించారు.

కార్యకర్తలకే ప్రాధాన్యత..
కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీజేపీయేనని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 25 గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇస్తున్నారని, కానీ రాష్ట్రంలో ఐదు హామీలనే అమలు చేయనివారు 25 హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ ఎన్నికలలో బీబీ పాటిల్‌ను గెలిపించాలని, 2028లో బాన్సువాడలో యెండల లక్ష్మీనారాయణకు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. పదేళ్లలో బీజేపీ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశానని ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమాలలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, రాంరెడ్డి, బాపురెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న రాజాసింగ్

నాడు నాయినమ్మ.. నేడు మనవరాలు

- కామారెడ్డికి రానున్న ప్రియాంక గాంధీ
- నలభై ఏళ్ల క్రితం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఇందిరాగాంధీ
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం



సాక్షి, కామారెడ్డి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనవరాలు ప్రియాంకగాంధీ శనివారం కామారెడ్డికి రానున్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించే జన జాతర సభలో ఆమె పాల్గొంటారు. 1980లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ పోటీ చేశారు. ఆ సమయంలో కామారెడ్డి పట్టణంలోని సీఎస్‌ఐ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభలో పాల్గొనేందుకు ఆమె వచ్చారు. ప్రస్తుతం ఆమె మనవరాలు ప్రియాంక గాంధీ కామారెడ్డికి వస్తుండడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కాగా 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాగర్జన సభలో ఇందిరమ్మ మనవడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఇప్పుడు ప్రియాంక గాంధీ వస్తున్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే కార్యక్రమంలో మార్పు జరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ప్రియాంక గాంధీ పర్యటన నేపథ్యంలో పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రియాంక గాంధీని చూడడానికి మహిళలు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని సంత్ సేవాలాల్ భవన్‌లో వివిధ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి జిల్లాలో పోలైన పోస్టల్ బ్యాలెట్‌లను మార్పిడి చేయాలని ఆదేశించారు. మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహించిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం వివరాల నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కాలం అత్యంత కీలకమన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లిపోయేలా చూడాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డబ్బు మద్యం పంపిణీ కాకుండా చూడాలన్నారు. నగదు, మద్యం పంపిణీపై సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్లకు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రంగనాథ రావు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

తరుగు పేరుతో దోచుకుంటున్నారు

- ఒక్కో లారీకి 25 బస్తాల తరుగు తీస్తున్నారు
- రైతుల ఆరోపణ.. మాచారెడ్డిలో ఆందోళన



పాల్వంచలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మాచారెడ్డి: ధాన్యం తూకంలో మోసం చేస్తూ ఒక్కో లారీకి 25 బస్తాల తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మిల్లర్ల తీరును నిరసిస్తూ శుక్రవారం పాల్వంచలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంటా పెట్టే సమయంలోనే ఒక్కో బస్తాకు 7 కిలోల తరుగు తీస్తున్నారన్నారు. అది చాలదన్నట్టు మళ్లీ రైస్‌మిల్లర్లు ఒక్కో లారీకి 25 బస్తాల తరుగు తీస్తూ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ధర్నా చేస్తున్న స్థలానికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోలేదు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని రైతులు పట్టుబట్టారు. దీంతో పోలీసులకు రైతులకు వాగ్వాదం చోటు చేసుకొంది. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేట్లు చూస్తామని ఎస్సై చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

కమల వికాసం పక్కా

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

కామారెడ్డి టౌన్: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీక్లీ మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సుభాష్‌రోడ్, సిరిసిల్లరోడ్, స్టేషన్‌రోడ్, రైల్వే కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా, కొత్తబస్టాండ్ వరకు సాగింది. సెల్‌ఫోన్ లైట్లతో బీజేపీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే కాంగ్రెస్‌కు మిగిలేది గాడిద గుడ్డేనన్నారు. దేశ భవిష్యత్తు కోసం ప్రధాని మోదీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. జహీరాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను లక్ష ఓట్ల మెజారిటీలో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

రైతులు ఆందోళన చెందొద్దు

- తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాం
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం జిల్లాకేంద్రంలో రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం అదనపు కలెక్టర్ గంజ్ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 39,142 మంది రైతుల నుంచి రూ.496 కోట్ల విలువైన 2.25 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పటివరకు రూ.395 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. మార్కెట్ యార్డులో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి
కామారెడ్డి రూరల్: ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం ఆయన క్యాసంపల్లిలోని రైస్ మిల్లును పరిశీలించారు. సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలను అభివృద్ధి చేస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- మద్నూర్ ఎస్సీ కాలనీలో బస





మద్నూర్ ఎస్సీ కాలనీలో నిద్రపోతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

మద్నూర్: ఎస్సీ కాలనీల్లో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి ఎమ్మెల్యే దంపతులు పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. రాత్రి కాలనీలోనే బస చేసి అందరితో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే అక్కడే నిద్రించారు. గత ప్రభుత్వం దళితులకు జరిగిన అన్యాయం, దళిత బంధులో జరిగిన మోసం పట్ల ఎమ్మెల్యేకు కాలనీ వాసులు వివరించారు. దళితులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సాయిలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, సాయి పటేల్ పాల్గొన్నారు.



కొమలంచ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల్లో చేరిన వర్షపు నీరు

వర్షానికి తడిసిన ధాన్యం

నిజాంసాగర్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోతోంది. శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. హమాలీలు, లారీల కొరతతో కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

క్లుప్తంగా

ఇందిరమ్మ కాలనీలు కాంగ్రెస్ ఘనత

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ



దోమకొండ: ప్రతి పల్లెల్లో ఇందిరమ్మ కాలనీలు, రాజీవ్నగర్ కాలనీలు ఉన్నాయని, వాటిని పేదలకు నిర్మించి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలువురు రెడ్డి సంఘం ప్రతినిధులు కాంగ్రెస్లో చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్గౌడ్, అనంత రెడ్డి, నర్సారెడ్డి, ఐరేని నర్సయ్య, శంకర్రెడ్డి, నల్లపు శ్రీను. అబ్రబోయిన స్వామి, సీతారాం మధు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కామారెడ్డి అర్బన్: ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి రైస్మిల్లులకు తరలించాలని కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్, అధ్యాయన వేదిక ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్కు వినతి పత్రం అందజేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జి జగన్నాథం, వెంకట్రాంరెడ్డి, డి మధుసూదన్, వేణుగోపాల్, శ్రీనివాస్, అంజయ్య, రమణ పాల్గొన్నారు.

స్వాధ్యాయ భక్తుల పూజలు



బాన్సువాడ రూరల్: అక్షయ తృతీయ సందర్భంగా శుక్రవారం యోగేశ్వర కృషి ఉన్న పలు గ్రామాల్లో స్వాధ్యాయ పరివార్ భక్తులు భూమిపూజ చేసి, పొలం దున్నారు. మండలంలోని బోర్లంలో జొడెడ్లతో కూడిన నాగళ్లు, ట్రాక్టర్లను ఊరేగించారు. అనంతరం గ్రామశివారులోని యోగేశ్వర కృషి పొలంలో పూజలు చేసి పొలం దున్నారు.

'బీసీ కుల గణనకు మోదీ వ్యతిరేకం'



రామారెడ్డి: బీసీ కుల గణనను మోదీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్రావు అన్నారు. ఎల్లారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో సదాశివనగర్ మండల బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి కాంగ్రెస్కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్షెట్కార్ను గెలిపించాలని కోరారు. అనంతరం బీసీ కుల గణనకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కొత్తపల్లి మల్లన్న, భాగన్న, సుదర్శన్, విఠల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని రైతుల ఆందోళన



బీబీపేటలో ధర్నా చేస్తున్న రైతులు

బీబీపేట: ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీబీపేటలో రైతులు ధర్నా చేశారు. ఐదు రోజుల నుంచి వడ్లు కొనుగోలు చేయడం లేదని, వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని సైతం ఏ గ్రేడులో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో వడ్ల కొనుగోలులో ఆలస్యం జరుగుతుందని బీఆర్ఎస్ హయాంలో కొనుగోళ్లను ఎప్పుడు ఆపలేదని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్కుమార్ అన్నారు. ఎంపీపీ బాలమణి, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలి

రాజంపేట: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీల్లో ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేసుకోవాని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం రాజంపేటలోని పలు రైస్మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్లోడింగ్ వేగవంతం చేయాలన్నారు. రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో అన్లోడింగ్ మందగించిందని మిల్లర్లు చెప్పారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున మిల్లర్లు హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని వడ్లు దించుకోవడంతో పాటు ధాన్యం నిలువలకు అవసరమైన స్థలాన్ని సర్దుబాటు చేసుకొని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వీడిన మిస్సింగ్ మిస్టరీ

- 2022 సెప్టెంబర్లో మహిళ అదృశ్యం
- ఏడాదిన్నర తర్వాత కేసు ఛేదన
- ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైనట్లు గుర్తింపు
- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్



వివరాలు వెల్లడిస్తున్న ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి కాజల్ సింగ్

కామారెడ్డి క్రైం: యేడాదిన్నరగా పెండింగ్లో ఉన్న ఓ మహిళ మిస్సింగ్ కేసును భిక్కనూర్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ కేసులో పోలీసులను తప్పుదోవ పట్టించి ఇంతకాలం తప్పించుకు తిరిగిన ఆమె ప్రియుడే హంతకుడని తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. శుక్రవారం కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్ వివరాలు వెల్లడించారు. భిక్కనూర్ మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన సంధ్య(28)కు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకునే ఆమె ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 సెప్టెంబర్ 16న మహిళ అదృశ్యమైనట్లు భిక్కనూర్ పీఎస్లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు పెండింగ్లోనే ఉంది.

మద్యం తాగించి..

దోమకొండ మండలం చింతమాన్పల్లికి చెందిన మహేష్ ట్రాక్టర్ డ్రైవర్గా పని చేసేవాడు. అదృశ్యమైన మహిళ సంధ్య కూలి పనులకు వెళ్లే చోట నాలుగేళ్ల క్రితం పరిచయమయ్యాడు. వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. తన సంసారానికి ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో మహేష్కు దూరంగా ఉండటం మొదలు పెట్టింది సంధ్య. దీంతో వారి మధ్య విభేదాలు వచ్చాయి. ఆమెను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న మహేష్ 2022 సెప్టెంబర్ 14న మాయమాటలు చెప్పి క్యాసంపల్లి శివారులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. ఆమెతో మద్యం తాగించి మత్తులోకి వెళ్లేలా చేశాడు. బండ రాయితో తల, ఛాతీపై మోది దారుణంగా హత్య చేశాడు. ఆమె వద్దనున్న రూ.50 వేలు నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని సెల్ఫోన్ను మరో చోట దూరంగా పడేసి పరారయ్యాడు.

పోలీసులను తప్పుదోవ పట్టించి..

మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెతో కలిసి కూలి పని చేసేవారిని, పరిచయస్తులను, బంధువులను అందరినీ విచారించినా ఎలాంటి క్లూ దొరకలేదు. ఆమెతో సన్నిహితంగా ఉండేవాడని తెలియడంతో అప్పట్లో మహేష్ను కూడా విచారించారు. తనకేం తెలియనట్లు నటించి పోలీసులను పక్కదారి పట్టించడమే కాకుండా విదేశాలకు పారిపోయాడు. ఆరు నెలల క్రితం తిరిగి వచ్చి తప్పించుకు తిరుగుతున్న ఆయనపై పోలీసులకు అనుమానం బలపడింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా మహేష్ ఆచూకీని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ట్రెయినీ ఐపీఎస్ తెలిపారు. హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించి మృతురాలి ఆనవాళ్లు గుర్తించామని వెల్లడించారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, సిబ్బంది, సహకరించిన సదాశివనగర్, సీసీఎస్ సీఐలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్సై రాజులను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ నాగేశ్వర్ రావు, రూరల్ సీఐ రామన్ తదితరులు పాల్గొన్నారు.

మెస్సేజ్లతో హోరెత్తిన ప్రచారం

- ఓటర్ల ఫోన్లకు అభ్యర్థుల వాయిస్లతో కాల్స్
- చేసిన పనులతో పాటు తాము చేపట్టబోయే వాటిపై హామీలు

మోర్తాడ్(బాల్కొండ): లోక్సభ ఎన్నికల పోలింగ్కు సమయం దగ్గర పడటంతో ఎంపీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల వాయిస్ కాల్స్తో ఓటర్ల ఫోన్లు హోరెత్తుతున్నాయి. అధినాయకుల సభలు, సమావేశాలు, కార్నర్ సమావేశాలు, ఇంటింటి ప్రచారంతో పాటు వాయిస్ కాల్స్తో ఎంపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తరఫున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్లు తమ వాయిస్ రికార్డులతో ఓటర్ల మొబైల్ ఫోన్లకు ఆటోమేటిక్గా కాల్స్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక మంది ఓటర్ల మొబైల్స్కు కాల్స్ వస్తున్నాయి. కొత్త నంబర్ల నుంచి కాల్స్ వస్తుండటంతో ఇదేమిటో అని ఓటర్లు ఫోన్ ఎత్తితే చాలు అవతలి వైపు నుంచి ఎంపీ అభ్యర్థుల పరిచయం, తమ పార్టీ ఇచ్చిన హామీలు, తాము చేపట్టబోయే పనుల గురించి చెబుతూనే ఉన్నారు. ముగ్గురు అభ్యర్థులు పోటా పోటీగా ఓటర్ల మొబైల్స్కు ఆటోమేటిక్గా కాల్స్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఏది ఏమైనా సాంకేతికతను ఎంపీ అభ్యర్థులు విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నారని చెప్పొచ్చు.

స్పెషల్ జుడీషియల్ జడ్జిని కలిసిన లీగల్ సర్వీస్ డిఫెన్స్ సభ్యులు

ఖలీల్ వాడి: నిజామాబాద్ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఫర్ మొబైల్ జడ్జి చైతన్య అంగారిని నిజామాబాద్ లీగల్ సర్వీసెస్ డిఫెన్స్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఉదయ్ కష్ణ, ప్రమోద్ గంగోన్, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ సమావేశం వాయిదా

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్(జెడ్పీ) సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కూడా జెడ్పీటీసీలు రాకపోవడం.. సంబంధిత అధికారులు మాత్రమే ఉండటంతో సమావేశాన్ని 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు తెలిపారు. చివరకు సమావేశ మందిరంలో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సీఈవో ఉష తెలిపారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని, తేదీని ముందుగానే ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

శిక్షణ శిబిరం పరిశీలన

సిరికొండ: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సత్యశోధక్ పాఠశాలలో నిర్వహిస్తున్న బేస్బాల్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, జిల్లా కోచ్ అనికేత్తో కలిసి సందర్శించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో నైపుణ్యాలను మెరుగుపర్చుకొని అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, పీఈటీలు అనిల్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా..

- ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ
- బీఎల్వోలకు బాధ్యతలను అప్పగించిన ఎన్నికల కమిషన్



ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్వో

మోర్తాడ్(బాల్కొండ): లోక్సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల కమిషన్, బూత్ లెవల్ అధికారు(బీఎల్వో)లకు దిశా నిర్దేశం చేసింది. గతంలో మాదిరిగా 70 నుంచి 75 శాతానికి పరిమితం కాకుండా కనీసం 90 శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేయాలని బీఎల్వోలకు నిర్దేశించారు. ఇంటింటికి పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేయించడంతో పాటు ఓటర్లను చైతన్యవంతులను చేయడానికి ప్రచారం నిర్వహిస్తుంది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో 1,808 పోలింగ్ బూత్లు ఉండగా మహిళలు, పురుషులు, ఇతరులు కలిపి 17,04,867 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లిన వారు ఉంటే వారిని వదలిపెట్టి ఇంటి వద్ద ఉండే ప్రతి ఒక్కరు ఓటు వేసేలా బీవోఎల్లు బాధ్యత వహించాల్సి ఉంది. ఓటర్ల స్లిప్పుల పంపిణీని ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి ఓటరుకు స్లిప్పును అందించే ఏర్పాట్లు చేసింది.

ఓటర్లకు మెస్సేజ్లు

పోలింగ్ శాతం పెంచడానికి ఎన్నికల కమిషన్ విస్తృతమైన చర్యలు తీసుకుంది. ఓటర్ల మొబైల్ నంబర్లకు ఎన్నికల కమిషన్ పేరు మీద ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎస్ఎంఎస్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా ముద్రించిన ఓటు హక్కును వినియోగించుకో అనే పోస్టర్లను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు.

క్రైం కార్నర్

వైద్యం వికటించి బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- మృతురాలి కుటుంబ సభ్యుల రాస్తారోకో



సుమలత(ఫైల్)



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఆర్మూర్టౌన్: వైద్యం వికటించి బాలింత ప్రాణాలు కోల్పోయిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పిట్ల సుమలత అలియాస్ జయ(31) మూడో కాన్పు కోసం మామిడిపల్లిలోని తిరుమల ఆస్పత్రికి గురువారం కుటుంబ సభ్యులతో కలిసివచ్చారు. సుమలతను పరిశీలించిన వైద్యులు ఇప్పటికే డెలివరీ సమయం అయిపోయిందని, పరిస్థితి విషమయంగా ఉందని త్వరగా ప్రసవం చేయాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటలకు మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఉమ్మ నీరు మింగి ఉండటంతో పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే సమయంలో సుమలతకు కడుపులో మంట, నడుము నొప్పి తీవ్రమైంది. కుటుంబ సభ్యులు సుమలత పరిస్థితి వైద్యులకు వివరించారు. సుమలతకు చికిత్స చేసిన కొద్దిసేపటికే మృతిచెందింది. సుమలత చలనం లేకుండా పోవడంతో వైద్యులను నిలదీశారు. సుమలత మృతిచెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటి వరకు బాగున్న సుమలత ఎలా మృతిచెందిందని, రెండు మార్లు మత్తు ఇంజక్షన్ ఇవ్వడం వల్లే సుమలత మృతిచెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం ఐఎంఏ సభ్యులు ఆస్పత్రికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపినా వారు మాట వినలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో కుటుంబ సభ్యులు శాంతించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు తెలుపుతున్న పోలీసులు

మోర్తాడ్(బాల్కొండ): తిమ్మాపూర్లో రంగు శ్రీనివాస్గౌడ్, తుపాకుల రాకేశ్ ఇళ్లలో మూడు రోజుల కింద దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు భీమ్గల్ సీఐ శ్రీనివాస్, మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్లో వారు మాట్లాడారు. తిమ్మాపూర్లోని రెండుఏ ఇండ్లలో తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర మాసాల బంగారం, ఐదు తులాల వెండి, ఒక వాహనాన్ని దొంగిలించారని పోలీసులు తెలిపారు. కోటగిరి మండలం సుంకిని చెందిన చాకలి రాజు, అంకాపూర్కు చెందిన విబిత్వార్ గోపిలు ఈ నేరాలకు పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. బంగారం, వెండి, వాహనాన్ని నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించినట్లు వెల్లడించారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ చైర్మన్ మృతి



శేఖర్రెడ్డి(ఫైల్)

నిజామాబాద్రూరల్: జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎల్లసాని శేఖర్రెడ్డి(50) శుక్రవారం ఉదయం హైదరాబాద్లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. కొంత కాలంగా శేఖర్రెడ్డి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వివరించారు. గతేడాది మే నెలలో చైర్మన్ పదవి చేపట్టారు. పీఏసీఎస్ సభ్యులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్తో రెండు గేదెలు..

ఆర్మూర్టౌన్: పట్టణంలోని యానంగుట్ట సమీపంలో విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. గురువారం సాయంత్రం వీచిన గాలుల ధాటికి కరెంటు సర్వీస్ వైర్లు తెగిపోయాయి. అటు వైపు ఉన్న గేదెలు మేత వేసేందుకు వచ్చినప్పుడు వైర్లు తగిలి విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాయి. ఘటనా స్థలానికి ఆర్ఐ అశోక్ సింగ్ చేరుకుని పంచనామా నిర్వహించారు. పశువైద్యాధికారులు రెండు గేదెలకు పోస్టుమార్టం చేశారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని గేదెల యజమానులు కోరారు.

మద్యం స్వాధీనం

మోపాల్(నిజామాబాద్రూరల్): మండలంలోని కులాస్పూర్కు చెందిన గూండ్ల గంగారాం నుంచి 17 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నుంచి కులాస్పూర్ వైపు మద్యం సీసాలను గంగారాం తరలించేందుకు మోపాల్ చౌరస్తాలో ఆటో కోసం ఎదురుచూస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీలు చేశారు. అందులో 96 క్వార్టర్ సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



క్షతగాత్రుడు తిరుపతి

నవీపేట : జన్నేపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని బొమ్మిడిగావ్కు చెందిన తిరుపతి తన అత్త ఊరు మాక్లూర్ మండలంలోని చిక్లీ గ్రామానికి శుక్రవారం ఉదయం బైక్పై వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో జన్నేపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు 108 అంబులెన్స్లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు

ఇందల్వాయిలో మరొకరికి..



గాయపడ్డ బానాజీ

ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి మార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగల్పాడ్ గ్రామానికి చెందిన బానాజీ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. నిజామాబాద్కి చెందిన వ్యక్తులు ఇద్దరు కారులో ధర్పల్లి నుంచి నిజామాబాద్కి వెళ్తుండగా ద్విచక్రవాహనంపై ఇందల్వాయి వైపు వస్తున్న బానాజీని వెనక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కారులో ఉన్న ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించగా తండావాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ బానాజీని అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించారు.

రైల్వేగేట్ తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

- గేటు దాటి వెళ్లాలనే తొందరపాటుతోనే ఘటన



గాయపడ్డ కుర్మ మల్లయ్య

ఎడపల్లి (బోధన్): రైల్వే గేటు దాటుతుండగా ప్రమాదవశాత్తు గేటు తగిలి ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. క్షతగాత్రుడు ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన కురుమ మల్లయ్య గుర్తించారు. రైల్వే గేట్ తలకు బలంగా తగలడంతో తీవ్ర రక్త స్రావమైంది. గాయపడిన వ్యక్తిని స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ఎడపల్లి నుంచి నిజామాబాద్కు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఇసుక అక్రమ తరలింపు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఎడపల్లి(బోధన్): మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కేసులో జరిమానా చెల్లించకపోవడంతో నిందితులను కోర్టులో హాజరుపర్చగా.. మేజిస్ట్రేట్ నెల రోజుల శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. 2019లో బోధన్ మండలం సాలూర నుంచి ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కోర్టులో నిందితులు బిల్లా హన్మాండ్లు, బిల్లా అభినయ్లను హాజరు పర్చగా మేజిస్ట్రేట్ సాయి శివ నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. దీంతో పాటు రూ.2500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో నెల రోజులు జైలు శిక్ష ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.